ఈనాడు
వైయస్సార్
మంగళవారం అక్టోబరు 1, 2024

నియంత్రికల్లో అవినీతి షాక్!

కడపకు చెందిన సంస్థకు దోచిపెట్టే వ్యవహారం

ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి అక్రమాలు

ఎస్పీడీసీఎల్ సరఫరా చేసే విద్యుత్తు నియంత్రికల్లో అవినీతి షాక్ కొడుతోంది. కడప నగరానికి చెందిన ఓ సంస్థకు దోచిపెట్టే క్రమంలో అక్రమాల పరంపర కొనసాగుతోంది. గత వైకాపా ప్రభుత్వానికి అంటకాగిన సదరు సంస్థ నియంత్రికలు, ఇతరత్రా పరికరాలను మరో ఏడాది కాలానికి కావాల్సిన మేరకు సరఫరా చేసేసింది. వైకాపా ప్రభుత్వం దిగిపోయే అవకాశాలు గ్రహించి ముందుగానే భారీగా ఎస్పీడీసీఎల్ స్టోర్లలో దింపేసింది. క్షేత్రస్థాయిలోనూ అవసరమున్నా, లేకున్నా విద్యుత్తు నియంత్రికలు అమర్చేస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ సర్వీసు మంజూరు కాని వారికి అంటగట్టేస్తున్నారు. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ



కడప నగరంలో ఎస్పీడీసీఎల్ స్టోర్ ఉంది. అక్కడ మరో ఏడాదికి అవసరమైన విద్యుత్తు నియంత్రికలు, పరికరాల నిల్వలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందే భారీగా తీసుకొచ్చి పెట్టేశారు. ఆ తర్వాత కూడా క్రమంగా నిల్వలు పెంచేశారు. 25 కేవీ విద్యుత్తు నియంత్రిక పక్క రాష్ట్రాల్లో రూ.70 వేలకు లభిస్తుండగా, ఇక్కడ మాత్రం రూ.1.60 లక్షల వరకు పెంచేశారు. గత వైకాపా సర్కారులో కీలక నేతకు అత్యంత సన్నిహితుడి కంపెనీకి లబ్ధి చేకూర్చడానికి ధరలతో పాటు ఇష్టారాజ్యంగా నియంత్రికలు, పరికరాలు సరఫరా బాధ్యతలు కట్టబెట్టారు. సరకు నిల్వపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి జీఎం శ్రీనివాసులు సోమవారం కడప నగరంలోని స్టోర్స్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

రాజంపేట మండలం మిట్టమీదపల్లెలోని జగనన్న కాలనీలో 2,666 ఇళ్లకుగానూ కేవలం 148 మాత్రమే నిర్మించారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో నిలిచిపోయాయి. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించక పోయినా విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు భారీగా ఏర్పాటు చేశారు. ఇంటి సర్వీసులకు 12, 16 కేవీ నియంత్రికలు అమర్చాల్సి ఉండగా, ఏకంగా 25 కేవీ సామర్థ్యం ఉన్నవి అధికం. వీటిల్లో 16 నియంత్రికలు అనవరంగా ఏర్పాటు చేశారు. వైకాపాకు చెందిన గుత్తేదారుకు లబ్ధి చేకూర్చేందుకు విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, లైన్ల ఏర్పాటు బాధ్యతలు అప్పగించారు. దాదాపుగా అన్ని కాలనీల్లోనూ ఇదే విధంగా దందా సాగించారు. అవసరానికి మించిన నియంత్రికలు ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు.


రాజంపేట మండలం మిట్టమీదపల్లెలో అవసరానికి మించి ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలు

రాజంపేట మండలం ఊటుకూరుకు చెందిన ఓ రైతుకు వ్యవసాయ సర్వీసు మంజూరు కాగా 25 కేవీ విద్యుత్తు నియంత్రికతో పాటు 33 కేవీ విద్యుత్తులైన్ తీగలు కేటాయించారు. వీటిని పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన మరో రైతు నుంచి రూ.1.50 లక్షలు అక్రమంగా వసూలు చేసి అమర్చారు. సాధారణంగా విద్యుత్తు సర్వీసు మంజూరుకు మ్యాపింగ్ జరుగుతుంది. అనంతరం వరుస క్రమంలో సీనియారిటీ ఆధారంగా రైతులకు సర్వీసులు మంజూరు చేస్తారు. ఇక్కడ జరిగిన అక్రమంపై విజిలెన్స్ విచారణ జరిగింది. ఇటువంటి దందాలు ఉమ్మడి కడప జిల్లాలో భారీగా జరిగాయి.

కడప నగరం, బద్వేలు పట్టణాల్లో అనధికార లేఅవుట్లు వెలిశాయి. వీటికి విద్యుత్తు సర్వీసులు ఇవ్వడానికి నిబంధనలు వర్తించవు. ఆయా వెంచర్ల యజమానులతో అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఇష్టా రాజ్యంగా సర్వీసులతో పాటు నియంత్రికలు ఏర్పాటు చేశారు. ఇందులోనూ భారీగా అవినీతి జరిగింది. విద్యుత్తు సర్వీసుల ముసుగులో అనుమతులున్నట్లుగా చూపించి ఇళ్ల స్థలాల అమ్మకం చేపట్టి ప్రజలను మోసం చేశారు. ఈ వ్యవహారంలో అప్పట్లో పని చేసిన ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కడపలోని అనధికార లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు

ఆలయ భూములు అన్యాక్రాంతం

చోద్యం చూస్తున్న దేవాదాయశాఖ

- ఈనాడు, కడప

మైదుకూరులో రూ.కోట్ల విలువైన దేవాదాయశాఖ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఫిర్యాదులొస్తేగానీ అధికారులు చర్యలకు ఉపక్రమించడంలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వెనుక భాగంలో సర్వే నంబరు 1845-1, 1845-2లో శ్రీమదవరదరాయస్వామికి చెందిన భూములు 10.20 ఎకరాల విస్తీర్ణం ఉండగా, ఏళ్లతరబడి నిర్లక్ష్యం చేయడంతో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. దీనిపై పుడపాల సంఘం పరిధిలోని లింగాలదిన్నెకు చెందిన చొక్కం రమేష్ లోకాయుక్తను ఆశ్రయించారు. ఒకవైపు విచారణలో ఉండగానే భూములను చుట్టూ కంచె వేసే ప్రయత్నం చేయగా, మరోసారి దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు మేల్కొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● తాజాగా పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో 1031, 1052, 1054, 1087 సర్వే నంబర్లలోని 38.61 ఎకరాలు, టెంపుల్ సర్వీసు కింద 38.61 ఎకరాలు, సర్వే నంబరు 1024, 1028లో 15.73 ఎకరాలు శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయ భూములుగా ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆ భూములను దేవాదాయ శాఖ అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారు. వీటిల్లో కొందరు ఇప్పటికే భవన నిర్మాణాలు పూర్తిచేయగా.. మరికొందరు నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో పాతూరుకు చెందిన చొక్కం ఆంజనేయులు నిషేధిత జాబితాలోని 1052 సర్వే నంబరులోని భూమిలో భవన నిర్మాణాలు చేపడుతున్నారని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వ్యవహారం వైరల్‌గా మారింది. దేవాదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టని పక్షంలో ఏపీ లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.


మైదుకూరులో దేవాదాయశాఖ భూమిలో అక్రమ భవన నిర్మాణాలు

చర్యలు తీసుకుంటాం

ఎస్.మైదుకూరులోని 1052 సర్వే నంబరు భూమి టెంపుల్ సర్వీసు కింద ఉంది. అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. భూములను పరిశీలించి ఎవరైనా నిర్మాణాలు చేస్తుంటే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటాం. - ప్రసాదరావు, ఈవో, దేవాదాయశాఖ, మైదుకూరు

ఇదేనా మీరు మాకిచ్చే మర్యాద?

రిమ్స్ అధికారులపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఆగ్రహం


ప్రొటోకాల్‌పై ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోత్స్నను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఈనాడు, కడప : ప్రజాప్రతినిధుల పట్ల మర్యాదలు పాటించే విషయంలో కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. వివరక కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి. మంత్రి సత్యకుమార్ సమక్షంలో ఆగ్రహం వ్యక్తం చేయగా తప్పును తెలుసుకుని క్షమాపణలు చెప్పడంతో వ్యవహారం సద్దుమణిగింది. ఆసుపత్రి అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అవమానపరుస్తున్నారంటూ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు, శంకుస్థాపనలకు, ఇతర కార్యక్రమాలకు ఆసుపత్రి అధికారులు ఉద్దేశపూర్వకంగా తమను ఆహ్వానించడంలేదని మండిపడ్డారు. దంత వైద్య కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమాల అనంతరం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దకు ప్రజాప్రతినిధులు చేరుకున్నారు. అక్కడ రూ.6 కోట్ల వ్యయంతో క్యాథ్ ల్యాబ్ సెంటరును మంత్రి ప్రారంభించారు. శిలాఫలకంలో మంత్రి, కలెక్టర్ పేరు మాత్రమే రాశారు. స్థానిక ఎమ్మెల్యే మాధవిరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి తోపాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్సీలు, ఎంపీ పేర్లను రాయలేదు. దీన్ని గమనించిన కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సూపర్ స్పెషాలిటీ, రిమ్స్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు సురేశ్వర్‌రెడ్డి, రమాదేవిని గట్టిగా నిలదీశారు. ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడంతోపాటు శిలాఫలకంలో పేర్లు వేయకపోవడంపై ప్రశ్నించారు. పక్కనే ఉన్న మంత్రి సైతం తీవ్ర అభ్యంతరం తెలిపారు. తన పేరు నమోదులో సైతం తప్పులున్నాయని, ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. శిలాఫలకంలో ప్రొటోకాల్ మేరకు పేర్లు రాయడంతో పాటు తప్పులు సరిదిద్దుతామంటూ సూపరింటెండెంట్లు క్షమాపణలు చెప్పడంతో వాతావరణం చల్లబడింది.

పేదలకు అత్యాధునిక వైద్యమే లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది అంకితభావంతో పని చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మినీ ఆడిటోరియం, అత్యవసర దంత క్లినిక్, సెంట్రల్ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ.6 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్‌ను ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, జేసీ అదితిసింగ్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దంత వైద్య కళాశాలలోని పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పరికరాలు, సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీ డాక్టర్ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.


దంత వైద్య కళాశాలలో అత్యవసర క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

ఒప్పంద ఉద్యోగాల క్రమబద్ధీకరణకు ఆందోళన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవలు, ఆప్కాస్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్ డిమాండు చేశారు. కడప కలెక్టరేట్ ఎదుట సోమవారం సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుర, రెవెన్యూ, అంగన్‌వాడీ, విద్యుత్తు, రిమ్స్ తదితర శాఖల్లో చాలామంది ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని విమర్శించారు. అందరినీ క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండు చేశారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కి వినతిపత్రం అందజేశారు. వీరి ఆందోళనకు ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం సంఘీభావం ప్రకటించింది. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీదేవి, రవి, వెంకటసుబ్బయ్య, విజయభాస్కర్, చంద్రారెడ్డి, ప్రసాద్, విజయకుమార్, పవన్, వినీల, అంజలి, సుబ్బయ్య, నరసయ్య పాల్గొన్నారు.


నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పుర కార్మికులు

నేతన్న నేస్తం అమలుకు డిమాండు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం అమలు చేయాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండు చేశారు. కడప కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై ఆధారపడి లక్షలాదిమంది జీవిస్తున్నా, గత ప్రభుత్వం కేవలం 73 వేల మందికి మాత్రమే పథకం అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం చేనేతల సమస్యలను గుర్తించి 2.70 లక్షల మందికి పథకం అమలు చేయాలని సూచించారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, మనోహర్, ప్రతాప్‌రెడ్డి, రమణ, గంగులు, ఆంజనేయులు, చెన్నా రామయ్య, పెంచలయ్య, జయరాములు, మల్లయ్య, రామచంద్ర, రమణ, కొండప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక నాయకులు

పేలుడు పదార్థాలు... తీస్తున్నాయి ప్రాణాలు!

- న్యూస్‌టుడే, వేముల


జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు

భూగర్భంలోని ముడిఖనిజాన్ని వెలికితీసేందుకు వినియోగించే పేలుడు పదార్థాలు పలువురి ప్రాణాలను బలిగొంటున్నాయి. పేలుళ్లకు ఉపయోగించాల్సిన జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లను హత్య చేసేందుకు కూడా వినియోగిస్తుండటంతో ఆందోళన నెలకొంది. తాజాగా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వి.కొత్తపల్లెలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ముగ్గురాయి గనుల్లో వీటిని అధికంగా వినియోగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. కార్మికుల కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయి. సంఘటన జరిగిన సమయంలో యాజమాన్యాలు కొంతమొత్తాన్ని ముట్టజెప్పి చేతులు దులుపుకొంటున్నాయి. 2021, మే 7న కలసపాడు మండలం మామిళ్లపల్లె వద్ద ముగ్గురాయి గనిలో పేలుళ్లతో 10 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో వేముల, వేంపల్లె మండలాల్లోని వి.కొత్తపల్లె, రంగోరిపల్లె, బచ్చయ్యగారిపల్లె, కుప్పాలపల్లెకు చెందిన ఆరుగురు మృతిచెందారు. 2003లో వేములలోని ఓ గనిలో పేలుడు జరగడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి కేసులు జిల్లా వ్యాప్తంగా అనేకం చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి పేలుడు పదార్థాలు ఉపయోగించి హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పోలీసుల నిఘా వైఫల్యంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనంతపురం కేంద్రంగా సరఫరా : అనంతపురం జిల్లా కేంద్రంగా పేలుడు పదార్థాలు జిల్లాకు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ వ్యక్తుల చేతుల్లోకి ఇలాంటి ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎంతో జాగ్రత్తగా వీటిని నిల్వచేయాలి. ఇందుకు విరుద్ధంగా ఎక్కడపడితే అక్కడ లభ్యవుతున్నాయి. గనుల యజమానుల నిర్లక్ష్యంతో కింద పనిచేసే కార్మికుల వద్ద ఇవి ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అంతరించి పోయిన బాంబుల సంస్కృతి జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్ల రూపంలో తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించండి

కడప విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో సోమవారం కడప, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల ప్రాంతీయ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాలకు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించకుండా గత ప్రభుత్వం తీవ్రంగా వేధించిందన్నారు. కూటమి ప్రభుత్వం ద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెట్టలేదన్నారు. జీవో 117 రద్దు, ఓపీఎస్‌ను పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నూతన పీఆర్సీని అమలు చేయాలని, అది వచ్చే వరకూ 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు నిర్వహించాలని, డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెంమహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి, కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు రమణ, ఏజాస్‌అహ్మద్, శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్యమేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్

అంజన్నా... ఆలయ పునర్నిర్మాణం ఎప్పుడన్నా?


అసంపూర్తిగా ఆలయ నిర్మాణ పనులు

వేంపల్లె, చక్రాయపేట, న్యూస్‌టుడే : ఉమ్మడి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండి క్షేత్రంలో ఆలయ పునర్నిర్మాణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. రూ.26 కోట్ల నిధులతో మూడేళ్ల కిందట చేపట్టిన పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, అధికారుల ముందుచూపు లేకపోవడం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. పనులను 2020, డిసెంబరు 24న అప్పటి సీఎం జగన్ ప్రారంభించగా, తమిళనాడుకు చెందిన గుత్తేదారు సంస్థ పనులు దక్కించుకుంది. పాత ఆలయాన్ని కూల్చేయడంతో 2021, అక్టోబరులో బాలాలయాన్ని నిర్మించి స్వామి దారువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా 130 రాతి స్తంభాలు, గర్భాలయం, తూర్పు, పడమర రాజగోపురాలు, ప్రాకారం లోపల బండపరుపు, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. గుత్తేదారు సంస్థకు రూ.18.50 కోట్ల వరకు బిల్లులు చెల్లించగా, నిధుల మంజూరు మేరకు పనులు పూర్తికాలేదని భక్తులు వాపోతున్నారు. ఈ విషయమై దేవాదాయశాఖ ఏఈఈ మిట్టా వెంకటనిఖిల్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం ఈ ఏడాది జులై చివరి నాటికి పనులు పూర్తికావాల్సి ఉందని, నిర్మాణంలో కొన్ని మార్పులు, చేర్పులు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు.

ఇదిగో చూడండి అక్రమం!



అక్రమంగా సదరం పత్రాల జారీతో పలువురికి పింఛన్లు రద్దయ్యాయని, గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన దందాను మంత్రి సత్యకుమార్ వద్ద సోమవారం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రస్తావించారు. కడప నగరంలోని పుత్తా ఎస్టేట్‌లో తన కార్యాలయానికి వచ్చిన మంత్రికి 'ఈనాడు' పత్రికలో 'నకిలీ దివ్యాంగులు' పేరిట ప్రచురితమైన కథనాన్ని చూపిస్తూ... ఇలాంటివి జిల్లాలో భారీగా ఉన్నాయని, వీటిని ఏరివేయడంతోపాటు అర్హులకు మంజూరు చేయాలని సూచించారు. తప్పుడు పత్రాలు జారీ చేసిన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి సమాధానమిచ్చారు. - ఈనాడు, కడప

కందిపప్పు వచ్చేస్తోంది!

దసరా పండగ వేళ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం

- న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, సుండుపల్లి

దసరా పండగ నాటికి రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం ముందుకొచ్చింది. ముందు గోదాములకు సరఫరా చేసి అక్కడ నుంచి చౌక ధరల దుకాణాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో చౌక ధరల దుకాణాలు 2,362 ఉన్నాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి ఇచ్చిన బియ్యం పత్రాలు 10,91,176 ఉండగా, లబ్ధిదారులు 32,76,098 మంది ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వం నిత్యావసర సరకుల కోటాను కుదించి బియ్యం, పంచదారతో సరిపెట్టేసింది. బహిరంగ విపణిలో కంది పప్పు కిలో రూ.170 నుంచి రూ.180కు పైగా పలుకుతోంది. పేదలు కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదిగో తెప్పిస్తున్నాం.. ఇదిగో తీసుకోండంటూ ఊరించి ఉసురుమనించి సామాన్యులకు పప్పన్నం దూరం చేసింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని ముందుకొచ్చింది. ఈ నెల నుంచి చౌక ధరల దుకాణాల్లో కందిపప్పును కిలో రూ.67కే పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రెండు జిల్లాలకు కలిపి 625 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాలకు చేరుతున్న కందిపప్పును ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు పంపిస్తున్నారు. డీలర్లను పిలిపించి తొలుత ఎండీయూ వాహనాల ద్వారా ఇస్తున్న ప్రాంతాలకు సర్దుబాటు చేస్తున్నారు.



దసరా పండగ కానుకగా అందరికీ ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించడంతో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. కొన్ని నెలల తరువాత కందిపప్పు తక్కువ ధరకే అందుబాటులో వస్తోందని తెలిసి బడుగులు, శ్రమజీవులు ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా తయారు చేసిన కవర్లలో కిలో వంతున నింపి పంపుతున్నారు. ఎక్కడికక్కడే తాత్కాలికంగా ముద్రించిన స్టిక్కర్లను ప్యాకెట్లను అతికించాలని అధికారులు ఆదేశించి రెండు జిల్లాల్లోని చౌక ధరల దుకాణాలకు సర్దుబాటు చేస్తున్నారు.


అంశం	వైఎస్ఆర్	అన్నమయ్య
చౌక ధరల దుకాణాలు	1,239	1,123
బియ్యం పత్రాలు	5,86,352	5,04,824
లబ్ధిదారులు	17,62,579	15,13,519
ఎండీయూ వాహనాలు	366	310
కందిపప్పు కేటాయింపు(టన్నుల్లో)	350	275

సరఫరాకు చర్యలు

ఈ నెల నుంచి చౌక ధరల దుకాణాల్లో కందిపప్పును పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించి కోటా కేటాయించింది. కార్డుదారులకు అవసరమైన కందిపప్పును తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దశలవారీగా నిర్దేశిత కోటా మేరకు తెప్పించి పంపిణీ చేస్తాం.
- అర్జున్‌రావు, శివరామమూర్తి, డీఎంలు, పౌర సరఫరాలసంస్థ, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలు



రైతేరాజు 6లో



ఆలకించండి... ఆదుకోండి

న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

గత వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించకపోవడంతో సోమవారం అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. అర్హత ఉన్నా పింఛను రావడం లేదని ఒకరు... జీవనం బరువై వేదనతో ఇంకొకరు, రుణం రాలేదని మరొకరు... ఇలా తమ ఆవేదనలు ఆలకించి, ఆదుకోవాలని విన్నవించారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఇతర అధికారులు వినతిపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేపట్టి, వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఎస్డీసీ వీడీ శ్రీలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

జీవనానికి ఇబ్బంది పడుతున్నాం



నా భర్తకు కొన్నేళ్ల కిందట ప్రమాదం జరిగి వెన్నెముకకు గాయమైంది. దీంతో నడవలేని పరిస్థితి. నేను భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీనికి తోడు మందులకు కూడా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నా భర్తకు రూ.15 వేలు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి. - చామా లక్ష్మీదేవి, చెర్లోపల్లి, ఒంటిమిట్ట

పింఛను మంజూరు చేయాలి



నేను దివ్యాంగురాలిని. నా పని నేను చేసుకోలేను. నడవలేని స్థితిలో ఉన్నా. పింఛను కావాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి నాకు పింఛను మంజూరు చేయాలి.

- నిర్మల, ఎగువపల్లి, పెండ్లిమర్రి మండలం

రుణం మంజూరైనా ఇవ్వడం లేదు - అరుణకుమారి, పోరుమామిళ్ల



నేను శ్రీవివేకేశ్వర డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉన్నా. సంఘానికి రుణం మంజూరు చేస్తే నాకు తప్ప అందరికీ ఇచ్చారు. ఇదేమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదు. నా డబ్బులు ఏమయ్యాయో చెప్పాలని మండల సమాఖ్యను కోరినా పట్టించుకోవడం లేదు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చా. నాకు న్యాయం చేయాలి.

కష్టపడిన వారికే భాజపాలో గుర్తింపు


మంత్రి సత్యకుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసిన వారికి భాజపాలో తగిన గుర్తింపు ఉంటుందని వైద్యారోగ్యశాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం ఎన్జీవో కాలనీలోని భాజపా కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను మంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని, పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడంతో ఈ స్థితిలో ఉన్నానని తెలిపారు. మోదీ హయాంలోనే భారతదేశం సుభిక్షంగా ఉందన్నారు. జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదులో వెనకబడి ఉన్నామని, దీనిపై దృష్టిసారించాలని నాయకులను సూచించారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఆరోగ్యశాఖను భ్రష్టుపట్టించిందని, దీని అపకీర్తి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని విమర్శించారు. భాజపా రాష్ట్ర నాయకులు బాలకృష్ణయాదవ్, మార్క్‌ఫెడ్ సభ్యుడు శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బొమ్మన విజయ్, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, రోశన్న, చేపూరి శారద, భానుప్రకాష్, బీరం సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మణరావు తదితరులున్నారు.

వినతుల వెల్లువ

కడప విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలని కోరుతూ ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి సోమవారం కడప నగరంలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. విభజన చట్ట ప్రకారం కడప ఉక్కు పరిశ్రమ కృషిచేయాలని విద్యార్థి సంఘాల నాయకులు రవిశంకర్‌రెడ్డి, జయచంద్ర, సుబ్బరాయుడు, శంకర్, నాగేంద్ర, ప్రశాంత్ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో యునాని వైద్య కళాశాల స్థాపించాలని కోరుతూ మంత్రికి రాష్ట్ర ఉర్దూ [illegible] అసోసియేషన్ (యూఏ) నాయకులు కోరారు.

అరవిందనగర్ (కడప): రిమ్స్ వైద్యకళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి సత్యకుమార్‌కు తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, నాయకులు వినతిపత్రం అందజేశారు.

మారుతీనగర్: పులివెందుల మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ ద్వారా కేటాయించిన ఎంబీబీఎస్ సీట్లను తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంత్రిని కోరారు.

రైతేరాజు

పత్తిలో గులాబీ రంగు పురుగును నివారిద్దాం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పత్తి పంటలో అక్కడక్కడ 50 పువ్వులను పరిశీలిస్తే వాటిల్లో అయిదు గుడ్డి పూలు ఉన్నట్లయితే గులాబీ రంగు పురుగులు ఆశించినట్లు రైతులు గుర్తించాలి. అదేవిధంగా పంటలో ఒక మొక్కకు ఒక కాయ చొప్పున మొత్తం 20 కాయలను సేకరించాలి. కోసినప్పుడు 20 కాయలకు రెండు గొంగళి పురుగులు ఉంటే నష్ట పరిమితి స్థాయిగా నిర్ధారించాలి. కాయ పైభాగంలో పురుగు బయటకు వచ్చే గుండ్రటి చిన్న రంధ్రం, కాయ తొనల మధ్య గోడలపై గుండ్రటి రంధ్రం ఉంటే ఈ పురుగులు వ్యాప్తి చెందినట్లు రైతులు గుర్తించాలి. గుడ్డి, రంగు మారిన పత్తిని గమనించిన వెంటనే కర్షకులు అప్రమత్తం కావాలి. పత్తి పొలం చుట్టూ తుత్తురు బెండ, ఉమ్మెత్త లాంటి ఆతిథ్యమిచ్చే కలుపు మొక్కలు లేకుండా చేయాలి. పత్తి పైరు సమీపంలో బెండ పంట ఉండరాదు. సేంద్రియ ఎరువులు, నత్రజని సత్తువల సమతుల్యత పాటించాలి. విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు నాలుగు లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. వరుసగా బుట్టల్లో మూడు రోజులు పాటు పరిశీలించాలి. రోజుకు 8 రెక్కల పురుగులు ఉంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలు, రాలిన పూత, పిందెలను వెంటనే సేకరించాలి. సమూలంగా నాశనం చేయాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా వ్యాప్తి చెంది ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే క్వినాల్‌ఫాస్ 25 ఇ.సి 2.5 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి 2 మి.లీ లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యూపి 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట ఆఖరి దశలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్ మైత్రిన్ 25 ఇ.సి 1 మి.లీ లేదా లామ్డాసైహలోత్రిన్ 5.0 ఇ.సి 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగు ఆశించిన పత్తిని రైతుల ఇళ్ల వద్ద, జిన్నింగ్‌మిల్లుల వద్ద గాని నిల్వ చేయరాదు. నీటి వసతి ఉన్నప్పటికీ పైరు కాలాన్ని ఆరు నెలలకు మించి పొడిగించరాదు.

- కె.సాయిమహేశ్వరి, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు

చిట్కా...


సాగు చేసిన బొప్పాయి తోట



రైతులకు వరం... మహానంది కొర్ర రకం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: వర్షాధార పంటల సాగులో ప్రత్యామ్నాయంతో పాటు తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే మహానంది 3156, 3159 నూతన కొర్ర వంగడాలను ఇటీవల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. దీంతో పాటు ఈ విత్తనాలను రైతులకిచ్చి క్షేత్రస్థాయిలో పంటలను కూడా సాగు చేయించడంతో మంచి ఫలితాలు వచ్చాయని ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. కొత్త రకాలు, వాటి దిగుబడులను ఆయన వివరించారు.

మహానంది ఎస్ఐఏ-3156 రకం

ఈ రకం పంట సాగు చేసిన తర్వాత 85 నుంచి 90 రోజులకు పంట కోతకు వస్తుంది. కంకి పొడవుగా ఉండి అధిక దిగుబడినిస్తుంది. అగ్గితెగులు వెర్రికంకి తెగులను తట్టుకుంటుంది. నత్రజని ఎరువులను బాగా స్వీకరిస్తుంది. జాతీయ స్థాయిలో విడుదల చేసిన ఈ రకం ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

మహానంది ఎస్ఐఏ-3159: ఈ రకం పంట కాలపరిమితి 80 నుంచి 85 రోజులు. అగ్గి తెగులు, వెర్రికంకి తెగులు, మొవ్వ ఈగను కొంత వరకు తట్టుకుంటుంది. యాంత్రీకరణకు అనువైన రకం. ఎకరాకు 11 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

క్షేత్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు: కొత్త కొర్ర రకాలను సాగు చేసి పరిశీలించారు. సీకేదిన్నె మండలంలోని కమ్మవారిపల్లె పంచాయతీ పరిధిలోని గొల్లపల్లెలో రైతులు వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి తమ పొలాల్లో ఈ రకాలను సాగు చేశారు. మంచి దిగుబడితో పాటు నాణ్యత వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారులు

బొప్పాయి సాగు... లాభాలు బాగు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం శీతగానిపల్లెకు చెందిన రైతు ఆనంద్ ఆరు ఎకరాల విస్తీర్ణంలో బొప్పాయి సాగు చేపట్టారు. పొలాన్ని బాగా దుక్కి చేసి అందులో 90 ట్రాక్టర్ లోళ్ల పశువుల ఎరువు, పది కుంటాళ్ల వేప, కానుగ పిండిని మిశ్రమం చేసి దుక్కిలో కలిపేశారు. దుక్కి పది హేను రోజుల పాటు ముగ్గిన తరువాత పది అడుగుల వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. బెడ్ల మధ్య మొక్కకు మొక్కకు ఏడు అడుగుల దూరంలో (రెడ్ లేడీ) హైబ్రిడ్ రకం మొక్కలు నాటారు. ఎకరా విస్తీర్ణంలో 900 మొక్కలు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. మొక్కలకు బిందుసేద్యంతో సాగునీటిని అందించారు. తోటకు చీడపీడలు ఆశించిన వెంటనే నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారి చేసి కాపును కాపాడుకున్నారు. మొక్కలు నాటిన ఎనిమిది నెలలకు కాపు వచ్చింది. తెగుళ్లు కారణంగా కాపు తగ్గినా ఆరు ఎకరాల విస్తీర్ణంలో 70 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. సాగుకు రూ.6 లక్షల వరకు ఖర్చు చేయగా తోట వద్దే కిలో బొప్పాయి రూ.15 వరకు ధర పలికింది. రైతుకు రూ.10 లక్షల వరకు రాబడి వచ్చింది. సాగు వ్యయం పోనూ రైతుకు రూ.4 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: రబీ సీజన్‌లో మినుము పంటను సాగు చేయనున్నాం. విత్తనశుద్ధి కోసం ఏ రకం మందులను ఎంత మోతాదులో వాడాలో తెలియజేయండి?

- ఎస్.శివరామయ్య, రైతు, పెద్దముడియం

సమాధానం: కిలో మినుము విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ 5 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 5 గ్రాములు, మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కార్బండిజమ్ 2.5 గ్రాముల మందులను కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. భూమిలో [illegible] విత్తిన 15-20 రోజుల వరకు పైరులో రసం పీల్చే పురుగుల బెడద ఉండదు. లేత పంటను తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- డాక్టరు ఎ.వీరయ్య, సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు

- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శివశంకర్

జిల్లాలో 139 మద్యం దుకాణాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: త్వరలో నూతన మద్యం పాలసీ అమలుకానున్న నేపథ్యంలో దరఖాస్తు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 139 మద్యం దుకాణాల ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నామని చెప్పారు. కడప పరిధిలో 30, సిద్దవటం-8, ఎర్రగుంట్ల- 14, జమ్మలమడుగు-14, ప్రొద్దుటూరు-19, పులివెందుల -16, ముద్దనూరు-7, మైదుకూరు-16, బద్వేలు-15 దుకాణాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి గెజిట్ విడుదలయ్యాక పూర్తి నియమ నిబంధనలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్, అసిస్టెంట్ డీపీఈఓ వినోద్‌కుమార్‌నాయక్, కడప సీఐ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దొంగల అరెస్టు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న 11 మందిని కడప అటవీక్షేత్రాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. కడప రేంజి మద్దిమడుగు సెక్షన్ రసూల్‌పల్లె బీటులోని ఎనుగొడ్డుకుంట ప్రాంతంలో అక్రమ రవాణా జరుగుతోందని కడప రేంజర్ ప్రసాద్‌కు సమాచారం రావడంతో వెంటనే డీఎఫ్‌వో సందీప్‌రెడ్డికి చెప్పారు. ఆయన ఆదేశాల మేరకు మద్దిమడుగు, మామిళ్లపల్లె సెక్షన్ల అటవీ సిబ్బంది వెళ్లి నిఘా ఉంచారు. అక్కడ కొందరు ఆటోలో 12 ఎర్రచందనం దుంగలను రవాణా చేసేందుకు సిద్ధమవుతుండగా సిబ్బంది వారిని చుట్టుముట్టి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారయ్యారని రేంజర్ ప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న దుంగల విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితుల్లో వీరబల్లి మండలానికి చెందిన రాయచోటి రమణ, రాచన్న, బి.శ్రీనివాసులు, షేక్ అల్లాబకాష్, జి.వెంకటరమణ, రాయచోటి రాచరాయుడు, జి.శేఖర్, షేక్ షావల్లి, షేక్ అల్లాబాషా, షేక్ షఫీవుల్లా, రాచరాయుడు ఉన్నారు. వారిని తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టులో హాజరు పరిచారు. కడప అటవీక్షేత్రాధికారి కె.ప్రసాద్, మామిళ్లపల్లె డిప్యూటీ రేంజర్ శ్రీపతి ఓబులేసు, మద్దిమడుగు సెక్షన్ అధికారి షకీల్ అహ్మద్, ఫారెస్టు బీటు అధికారులు ముఖర్జీ, కృష్ణ ప్రసాద్, చౌడయ్య, బాషా, నందిని, రఘువీర్, అసిస్టెంట్ బీటు అధికారిణి నాగేశ్వరి తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, నిందితులతో అటవీ అధికారులు

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్టు), బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల (ఔట్‌సోర్సింగ్) ప్రాతిపదికన భర్తీచేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ-3, పార్ట్ టైం టీచర్- 3, అకౌంటెంట్-2, వార్డెన్- 2 పోస్టులకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు apkgbv.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం



పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. యోగివేమన విశ్వవిద్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో **లక్షుమయ్య** (51) అనే ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెండ్లిమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న లక్షుమయ్య కడపలో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు కడప నుంచి ద్విచక్రవాహనంపై పెండ్లిమర్రికి బయలుదేరారు. యోగివేమన విశ్వవిద్యాలయం సమీపంలో రోడ్డుకు అడ్డుగా పంది రావడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లక్షుమయ్య మృతితో పెండ్లిమర్రి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంఈవో సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు కడపకు వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.



బద్వేలు గ్రామీణ, మైదుకూరు, న్యూస్‌టుడే: బద్వేలు మండలంలోని లక్ష్మీపాళెంవాసి **నాగయ్యగారి గుర్రప్ప** (46)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సోమవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. బద్వేలు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా పెద్దఅగ్రహారం వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దారిన వెళుతున్న వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆపై తిరుపతికి, అనంతరం చెన్నైకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుర్రప్పకు భార్య, అయిదుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో వారు పెద్ద దిక్కును కోల్పోయారు. గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

- మైదుకూరు పట్టణంలోని శ్రీనగరం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో కంచెర్ల రుద్రదీపు (23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఇతను స్థానిక చాకలివీధికి చెందినవారిగా గుర్తించారు. మైదుకూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అనుమానాస్పదస్థితిలో మత్స్యకారుడి మృతి



ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని సోమశిల ముంపు గ్రామం కొండమాచుపల్లె సమీపంలోని సోమశిల వెనుక జలాల్లో ఓ మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన **ఓ.మహంకాళి** (40) తన కుటుంబసభ్యులతో మూడు నెలల కిందట ఇక్కడకు వలస వచ్చారు. వెనుకజలాల్లో చేపలు పట్టడానికి మూడు రోజుల కిందట నావలో వెళ్లారు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, సహచర మత్స్యకారులు గాలింపు చేపట్టగా అతని మృతదేహం నీటిలో బయటపడింది. ఒంటిమిట్ట పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడానికి వీలుకాకపోవడంతో వైద్యులే ఘటనాస్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. నీటిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారా, ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మహంకాళికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

పీఎఫ్ కార్యాలయం తనిఖీ

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప భవిష్యనిధి(పీఎఫ్) కార్యాలయాన్ని సోమవారం అదనపు కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.వీరభద్రస్వామి తనిఖీ చేశారు. ఆధునీకరించిన కార్యాలయాన్ని పరిశీలించారు. పీఎఫ్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించి దస్త్రాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సిబ్బందికి సూచించారు. ఉద్యోగులకు సత్వర సేవలందించాలని పేర్కొన్నారు. పలువురు అధికారులున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఠాణాలకు వచ్చే ప్రతి బాధితునికి న్యాయం చేయాలని జిల్లా ఏఎస్పీ ప్రకాష్‌బాబు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత ఠాణాలకు బదలాయించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులను ఠాణాల చుట్టు తిప్పించుకోవద్దని సిబ్బందికి సూచించారు. మహిళా సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండల పరిధి నెర్సుపల్లి పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన శివాజీని అదుపులోకి తీసుకున్నట్లు పులివెందుల డీఎస్పీ మురళినాయక్ తెలిపారు. నిందితుడిని సోమవారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితుడిపై ఈ నెల 27న పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

ఎస్టీ, ఎస్సీ భూములను అప్పగించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప రామాంజనేయపురంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలను పోలీసులు, రెవెన్యూ అధికారులు కూల్చేస్తున్నారని, తక్షణమే వాటిని ఆపాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని, లేకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజుమాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య యాదవ్, న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు

● ప్రొద్దుటూరు ● జమ్మలమడుగు ● బద్వేలు ● మైదుకూరు

విద్యార్థుల వినూత్న ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రొద్దుటూరు పట్టణంలో సోమవారం వినూత్న ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రాజీవ్ సర్కిల్ నుంచి సుమారు 400 మందితో శివాలయం కూడలి వరకూ భారీ ర్యాలీ సాగింది. విద్యార్థులు వివిధ సందేశాత్మక వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వచ్ఛభారత్ నృత్యం స్థానికులను ఆకట్టుకుంది. శివాలయం కూడలి వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు.

నకిలీ దివ్యాంగులకు పింఛను నిలిపివేత

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 159 మందికి ఎన్టీఆర్ భరోసా కింద అందించే పింఛన్లను ఉన్నతాధికారులు నిలిపివేశారని ఎంపీడీవో నాగప్రసాద్ సోమవారం తెలిపారు. కొందరు వినికిడి, కంటి చూపు, వైకల్యం అధిక శాతంతో ఉన్నట్లు తప్పుగా ధ్రువీకరణ పత్రాలను ఇచ్చినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. మండలంలోని 159 మందిని అనర్హులుగా పరిగణిస్తూ పింఛన్ల నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే గత నెలలో 78 మందిని గుర్తించగా వారిలో పింఛన్లు పొందుతున్న 61 మంది పింఛన్లను సెప్టెంబరు ఒకటో తేదీ ఇవ్వకుండా నిలుపుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ఉంటుందని తెలిపారు.

కరెంట్ కట్

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక పాత కోటలో ఉన్న 19, 20 వార్డు సచివాలయానికి విద్యుత్తు శాఖ అధికారులు సరఫరాను నిలిపివేశారు. సుమారు రూ. 20 వేల వరకు విద్యుత్తు బకాయిలు పేరుకు పోవడంతో సోమవారం కరెంట్ కట్ చేశారు.

మామను వాహనంతో ఢీకొట్టిన అల్లుడు... కేసు నమోదు

చాపాడు, న్యూస్‌టుడే: మండలంలోని నాగులపల్లెకు చెందిన మల్లికార్జునరెడ్డిపై ఆయన అల్లుడు విద్యాసాగర్‌రెడ్డి దాడిచేసి గాయపరిచారని హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మల్లికార్జునరెడ్డి కుమార్తె మౌనికను అదే గ్రామానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. రెండేళ్ల కిందట వీరి రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు పెరిగి, దాడులు చేసుకొని గాయాలయ్యాయి. తిరిగి సోమవారం మల్లికార్జునరెడ్డి ద్విచక్రవాహనంపై ఇంటికి వెలుతుండగా, వెనక బొలెరో వాహనంతో విద్యాసాగర్‌రెడ్డి ఢీకొట్టి గాయపరిచారని పోలీసులు వివరించారు.

డోజరు, ట్రాక్టరు స్వాధీనం

మైదుకూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎల్లంపల్లె సమీప గిగ్గిపు వద్ద సోమవారం రాత్రి అక్రమ మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలీసులు ఒక డోజర్, ట్రాక్టరు స్వాధీనం చేసుకున్నారు. పొక్లెయిన్, డోజర్, ట్రాక్టర్లతో కలిసి గిగ్గిపు వద్దకు చేరుకుని తవ్వకాలు చేసి అక్రమ రవాణా చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. వీఆర్వో ఓబులేసుతోపాటు గ్రామ రెవెన్యూ అధికారులు, ఎస్సై సుబ్బారావు గిగ్గిపు వద్దకు వెళ్లారు. అధికారులు, పోలీసులను చూసి కొన్ని వాహనాలు వెళ్లిపోగా ఒక డోజర్, ట్రాక్టరు స్వాధీనం చేసుకున్నారు.

వాహనాల తనిఖీ

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వాహనాలకు సరైన అనుమతి పత్రాలు చూపకపోవడంతో 40 వాహనాలను సీజ్ చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు. మల్లతత్తువ, అంబేడ్కర్ కూడలి వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేశామని తెలిపారు. ద్విచక్రవాహనాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు, లైసెన్సు, హెల్మెట్, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులను స్టేషన్కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు.

అటవీ అధికారుల అదుపులో ముగ్గురు

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం వెదురూరు వద్ద వినిది మాంసం దొరికిందని గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అటవీశాఖాధికారి ప్రణీత్ తెలిపారు. స్థానిక మొక్కజొన్న తోటలో అడవిపందిని బంధించి మాంసంగా తయారు చేశారన్న ఆరోపణలతో వారిని విచారిస్తున్నట్లు చెప్పారు. మాంసాన్ని ప్రయోగశాలకు పరీక్ష నిమిత్తం పశువైద్యాధికారులకు పంపామన్నారు. వన్యప్రాణి ఎలా చనిపోయిందో తమకు సమాచారం ఇవ్వకపోవడం నేరమవుతుందని, విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ప్రజలు, సన్నిహితుల అభిమానం మరువలేనిది


మంత్రి సత్యకుమార్‌ను సన్మానిస్తున్న ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టరు వరుణ్‌కుమార్‌రెడ్డి, పంజగల మధుసూదన్ బాబు, అరకటవేముల హరినారాయణ, తదితరులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: సొంత గడ్డ ప్రొద్దుటూరులో తనపై ప్రజలు, సన్నిహితులు చూపిన అభిమానం మరువలేనిదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు ఘనస్వాగతం పలకడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఆదివారం సాయంత్రం పుట్టపర్తి కూడలి నుంచి రాయల్ కౌంటీ వరకూ భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ పౌరసన్మాన సభలో పలు సంఘాలకు చెందిన నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా సత్కరించారు. వేలాదిగా ప్రజలు సన్మాన సభలో పాల్గొని మంత్రిపై అభిమానం చాటుకున్నారు. సభ నిర్వాహకులుగా సంస్కృతీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, పంజగల మధుసూదన్‌బాబు వ్యవహరించారు. అడ్వకేట్ సీవీ సురేష్, భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, అరకటవేముల హరినారాయణ, భాస్కర్‌రావు, జనార్దన్‌రెడ్డి, గంగాధర్, కేరోజీ రావు, తదితరులు పాల్గొన్నారు.

హోలిస్టిక్ ఆసుపత్రి ప్రారంభం


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో హోలిస్టిక్ ఆసుపత్రిని సోమవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ స్థానిక ఎమ్మెల్యే ఎన్.వరదరాజులురెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో 50 శాతం మంది ప్రజలు మధుమేహం, రక్తపోటు బారిన పడుతున్నారని వీటివల్ల గుండె సమస్యలు వస్తున్నాయన్నారు. అవగాహనలోపంతో గుండె సంబంధిత వ్యాధిని గుర్తించేలోపే వారు మరణిస్తున్నారన్నారు. దీనిని నివారించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్టెమీ అనే కార్యక్రమం ద్వారా ప్రతి సీహెచ్‌సీల్లో గుండెలోని బ్లాక్స్‌ను తొలగించేందుకు రూ.45 వేలు విలువ చేసే సూది మందును అందుబాటు ఉంచుతామన్నారు. అన్ని అత్యాధునిక పరికరాలతో అన్ని వసతులు కల్పిస్తూ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నాగరాజు, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఆసుపత్రి ఛైర్మన్ రామచంద్ర, మేనేజింగ్ డైరెక్టర్ తుష్షార ఆలూరి, సీఈవో హనుమాన్ ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ సుబ్బర పాపినేని, సీవోవో శరత్‌బాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం...పట్టని అధికారగణం

✧ వర్షం వస్తే ఆటో నగర్ జలదిగ్బంధం ✧ 38 ఏళ్లుగా కష్టాల్లో స్థానికులు


వాన నీటిలో దిగి సమస్య చెబుతున్న స్థానికులు

–న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ పాత ఆటోనగర్ 1986లో స్థాపించారు. 54 ఎకరాల్లో 800 ప్లాట్లు విభజించారు. లారీ బాడీ, విద్యుత్తు సామగ్రి, పెయింటర్లు, టైరు పంచర్లు, వాహన విడి భాగాలు, గుజిరి సామాన్లు, కారు మెకానిక్, హోటళ్లు వంటి దుకాణాలు, గ్యారేజ్‌లు ఉన్నాయి. వీటిలో సుమారు వెయ్యి కుటుంబాలు గత 38 ఏళ్లుగా జీవిస్తున్నాయి. పంచాయతీకి పన్నుల రూపంలో లక్షల రూపాయలు చెల్లిస్తున్నా, అభివృద్ధికి ఆమడ దూరంగా ఉందని ఆటో నగర్ వర్తకులు, కార్మికులు వాపోతున్నారు. ఎప్పుడు వర్షమొచ్చినా మట్టి రహదారులు, దుకాణాలు, తాగునీటి పథకాలు, రిపేరుకొచ్చిన వాహనాలు జలదిగ్బంధమవుతాయి. ఎటూ చూసిన బురద, నీటి నిల్వలు అడుగు తీసి అడుగు వేయలేని స్థితి, దుర్వాసన, దోమలు విజృంభిస్తాయి. ప్రతి ఏటా జేసీబీ యంత్రాలతో నిల్వ నీటిని బయటికి పంపించి పనులు చేసుకోవాల్సిన దుస్థితి. ఎండా కాలం వచ్చి ఆవిరయ్యే వరకు నరక యాతన తప్పదని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం. వీటిపై కొత్తపల్లె పంచాయతీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆటో నగర్ సమస్య పరిష్కారానికి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు నిధులు కావాల్సి ఉంది. ఎమ్మెల్యే ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తామన్నారు.


పాచి పట్టిన నీటిలో లారీ

సభ దృష్టికి పట్టణ సమస్యలు


హాజరైన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, పురాధ్యక్షురాలు లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సోమవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్లు పురాధ్యక్షురాలు బి.లక్ష్మీదేవి దృష్టికి తీసుకొచ్చారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ సభకు విచ్చేశారు. చికెన్ అంగళ్ల నుంచి వ్యర్థాలు సేకరించడం, ఓ ఉద్యోగిని పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా తిరిగి నియామకం, ఎల్‌ఈడీ దీపాల అంశాలు వాయిదా వేయగా మిగిలిన అంశాలను అధ్యక్షురాలు ప్రకటించారు. ఉపాధ్యక్షులు బంగారు రెడ్డి, ఖాజా, సభ్యులు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ అభివృద్ధి పనులు, సమస్యలు సకాలంలో పరిష్కారానికి నోచుకోవడం లేదని, అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇర్ఫాన్‌బాషా మాట్లాడుతూ శ్రీరాములపేటలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనం నిర్మించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. చింతకుంట సరితారెడ్డి మాట్లాడుతూ మూడు సమావేశాల్లో కాలువపై అక్రమ కట్టడాలను ప్రస్తావించినా చర్య తీసుకోలేదన్నారు. కొత్తగా వచ్చిన టీపీవో చంద్రమోహన్ చర్యలు తీసుకుంటారని కమిషనర్ రఘునాథరెడ్డి చెప్పారు. ఈక్రమంలో ఆ కౌన్సిలర్ నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ టీపీవో పరిశీలించి చర్యలు తీసుకుంటారని కౌన్సిలర్‌కు సర్దిచెప్పారు.

వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రొద్దుటూరు అనుకూలం: మంత్రి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనాలోచిత చర్యల వల్ల జిల్లాలో వైద్య, ఆరోగ్య రంగం దెబ్బతినిందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. దీనిపై సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. పలు విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డితో కలిసి ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏవిధంగా చూసినా వైద్య కళాశాల నిర్మించేందుకు ప్రొద్దుటూరు అనువైన ప్రాంతమని, పులివెందుల సరికాదన్నారు. అక్కడ వసతులు లేని కారణంగా అధ్యాపకుల కొరత ఏర్పడిందన్నారు. వచ్చే సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యేలా చేస్తామన్నారు. అన్ని ప్రాంతాలకు కేంద్రంగా ఉన్న ఇక్కడి ఔషధ నియంత్రణ కార్యాలయాన్ని పులివెందులకు తీసుకుపోయిన జగన్ ఆలోచన సరికాదన్నారు. ప్రొద్దుటూరులో వైద్య కళాశాల ఏర్పాటు కృషి చేస్తామన్నారు. జిల్లా ఆసుపత్రిలో మౌలికసదుపాయాలకోసం ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. టెండర్లు పిలిచి సంవత్సరంలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. డీఎంహెచ్‌వో నాగరాజు, డీసీహెచ్ఎస్ హిమదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు వైద్యం: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎర్రగుంట్ల భాజపా అధ్యక్షుడు మేకల జగన్‌మోహన్‌రెడ్డి కలిశారు. రెండు రోజులు జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రిని సోమవారం ప్రొద్దుటూరులో కలిసి పలు విషయాలను చర్చించారు. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ వినతి పత్రం అందించారు. పూర్తి వైకల్యం కలిగిన దివ్యాంగులకు రూ.15 వేలు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ వినతి పత్రం అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు

చాపాడు, కలసపాడు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు చాపాడులోని అయ్యవారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు బాధ్య హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. ప్రొద్దుటూరులో జరిగిన జిల్లా పోటీల్లో కిరణ్, మునాఫ్, నాగచరణ్, మనస్విని ప్రతిభ చూపినట్లు ఆయన చెప్పారు. కలసపాడు మండలంలోని శంఖవరం విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తాచాటి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో ట్రిబుల్‌జంప్‌లో ఎస్.కె.హిమాం, లలిత జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు కల్లూరు విద్యార్థులు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి పోటీలకు 21 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, వ్యాయామ సంచాలకుడు అల్లాబకష్ తెలిపారు. వారు మాట్లాడుతూ 10, 9వ తరగతి విద్యార్థులు వి.ధనుష్, పి.ఉదయ్‌కిరణ్, కె.గురునాని, ఎస్.భవిత రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని, వీరు ఈ నెలలో నంద్యాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని, అలాగే జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు 13 మంది, కబడ్డీ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని వారు తెలిపారు. వీరిని ఉపాధ్యాయ, విద్యార్థి బృందాలు అభినందించినట్లు వారు తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న కల్లూరు పాఠశాల ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

బద్వేలు, న్యూస్‌టుడే: అండర్ 14, 17 కబడ్డీ బాలురు, బాలికల విభాగంలో బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల బాలికల జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీకి ఎంపికైంది. అండర్-14 బాలికల విభాగంలో ప్రసన్న, అనుపమ, జ్యోతి, సుప్రజ, గాయత్రి, సునీత, కావ్య ఎంపికయ్యారని హెచ్ఎం వెంకట సుబ్బారెడ్డి, పీడీ బాలయ్య తెలిపారు. అండర్-17లో కల్పన, కావేరి, అమ్ములు, మౌనిక, స్నేహలత, హేమప్రియ, అఖిల, లక్ష్మీనారాయణమ్మ, సరస్వతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో అండర్-14లో సిద్ధు, కిషోర్, సుధీర్, ఓబుళ్‌రెడ్డి, జగన్, జస్వంత్, సుధీర్, అండర్-17లో వినోద్, మధుమోహన్‌రెడ్డి, నాగేంద్ర, జాగు, సాధిక్ ఎంపికయ్యారు.

రోడ్డుపై చెత్త పడేస్తే జరిమానా


దుకాణ యజమానితో మాట్లాడుతున్న కమిషనరు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో సోమవారం రోడ్డుపై చెత్త పడేసిన పూల అంగడి యజమాని గౌస్‌కు కమిషనర్ నరసింహారెడ్డి రూ.1000 జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు, పురజనులు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజన్‌లో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజున మాంసం అంగళ్లను మూత వేయాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఆయన బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు.

రూ.1.77 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలంలో రూ.1.77 కోట్లు ఉపాధిహామీ పథకం నిధుల కింద సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు ఇంజినీరు మధుసూదన్‌బాబు తెలిపారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి గ్రామ నాయకులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. 22 గ్రామపంచాయతీల్లో 49 పనులు 7 కిలోమీటర్లమేర సిమెంటు రహదారులు ఈనెల పదో తేదీనాటికి పనులు పూర్తి చేయాలని ఇంజినీరు సూచించారు

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్

ప్రాంతీయ కార్యాలయము : కడప
డోర్ నెం.4/622-డి, 1వ అంతస్తు,
ఆర్.టి.సి బస్టాండ్ ఔట్‌గేట్ ఎదురుగా, అరవిందనగర్, కడప.

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, ప్రొద్దుటూరు గోపవరం శాఖను హౌసింగ్ బోర్డు కాలనీ, కొర్రపాడు రోడ్, పాలిటెక్నిక్ కాలేజ్ దగ్గర గల ప్రాంతాలలో ఏ ప్రదేశములోనైనా అన్ని వసతులు గల వేరొక భవనములోనికి మార్చదలచినాము.

ఇందు నిమిత్తము సుమారు 1200 నుండి 1600 చదరపు అడుగుల కార్పెట్ ఏరియా గల భవనము నిర్మించి ఉన్న వారు (గ్రౌండ్ ఫ్లోర్) లేదా సొంత ఖాళీ స్థలంలో భవనము నిర్మించదలచిన వారు (గ్రౌండ్ ఫ్లోర్), కనీసం 200 చదరపు అడుగుల స్ట్రాంగ్ రూమ్ (రిజర్వ్ బ్యాంక్ నియమ నిబంధనల మేరకు)తో సహా నిర్మించి మరియు పార్కింగ్ & నీటి సౌకర్యం కలిగి ఉన్న భవనము అద్దెకు కావలెను.
కావున ఆసక్తి గల వారి నుండి టెండర్ కోరడమైనది.

సాంకేతిక మరియు ఆర్థిక టెండర్ పత్రములు బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం, కడప నందు లభించును. పూర్తి చేసిన టెండర్లు, విడి విడి సీల్డ్ కవరులో ఉంచి, ఆ రెండింటిని వేరొక కవరులో ఉంచి సీల్డ్ చేసి తేదీ : **22.10.2024** లేదా అంతకన్నా ముందు, ప్రాంతీయ కార్యాలయము, కడపకు చేరునట్లు పంపవలయును.

వివరములకు సంప్రదించండి : Cell : 9490158398, 9490158018, ప్రాంతీయ కార్యాలయము, కడప

ఇట్లు : రీజనల్ మేనేజర్, కడప.

గమనిక : టెండర్లను ఏ దశలోనైనా రద్దు చేసే లేక మార్పు చేసే అధికారము బ్యాంకు వారికి కలదు.

ప్రయాణికుల సమస్యలు... పరిష్కరించక బుట్టదాఖలు

ఆకస్మిక తనిఖీలో ఎమ్మెల్యే గుర్తించిన ఇబ్బందులు

నామమాత్రపు చర్యలతో మమ


బస్టాండులో కార్గో పార్శిల్ కేంద్రం వద్ద పాచిపట్టిన వాననీరు

–న్యూస్‌టుడే, మైదుకూరు

రాయలసీమకు కూడలి మైదుకూరు. వివిధ డిపోలకు చెందిన బస్సులకు ఆర్టీసీ బస్టాండు కేంద్రంగా మారింది. ఏళ్లు గడచిపోతున్నా.. ప్రభుత్వాలు మారిపోతున్నా అభివృద్ధికి నోచుకోలేదు. బస్టాండుకు చేరే ప్రయాణికులు ఉస్సూరుమంటున్నారు. ఇంతేలేనంటూ సరిపెట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో బస్టాండులో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. కొన్ని సమస్యలను గుర్తించారు. నెలరోజుల్లో పరిష్కరించాలని ఆదేశించినా మొక్కుబడి చర్యలు తప్పితే ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడలేదు. మైదుకూరు-కడప రహదారి నుంచి బస్టాండులోకి ప్రవేశించే దారి ఇరుకుగా ఉంది. బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు వేగంగా మలుపు తిరుగుతున్నాయి. గతంలో ప్రమాదాలు జరిగాయి. వాహనాల వేగాన్ని నియంత్రించేలా వేగ నిరోధకాల అవసరాన్ని గుర్తించారు. బస్సుల రాకపోకలు సాగించే సిమెంట్‌రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు సాగించకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, బస్టాండు నుంచి ప్రధాన రహదారి వరకు చీకటి లేకుండా విద్యుద్దీపాలు, బస్టాండు ఆవరణంలో పిచ్చి మొక్కలు లేకుండా తొలగించి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులకు శుద్ధజలం అందించేలా మినరల్‌వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పాలని, బస్టాండు ఆవరణంలో దెబ్బతిన్న సిమెంట్‌రోడ్డును పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. వానొస్తే బస్టాండు ఆవరణంలో పెద్దఎత్తున వర్షపునీరు నిల్వ చేరుతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో పాచిపట్టి దోమలకు ఆవాసంగా మారుతోంది. కార్గో కేంద్రం వద్ద గొయ్యిలో వర్షపునీరు చేరి పాచి పట్టాయి. దోమలకు ఆవాసంగా మారింది. డిపో మేనేజర్ కార్యాలయం ఎదురుగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి.


బస్టాండు ప్రవేశ మార్గంలో దెబ్బతిన్న సిమెంటు రోడ్డు

మొక్కుబడిగా పనులు

బస్టాండు ఆవరణం ముందుభాగంలో పరిసరాల పరిశుభ్రతకు అధికారులు మొక్కుబడి చర్యలు తీసుకున్నారు. పిచ్చిమొక్కలను తొలగించారు. అయితే చెట్ల కొమ్మలను తొలగించిన అధికారులు ఆవరణంలోనే వదిలేశారు. ప్రధాన రహదారి నుంచి లోపలికి, బయటకు వెళ్లే ప్రాంతాల వద్ద ఇన్, అవుట్ అంటూ పలకలను ఏర్పాటు చేశారు. సైకిల్ స్టాండు వద్ద పరిసరాలు అధ్వానంగా ఉండటంతో శుభ్రం చేసే చర్యల్లో భాగంగా మట్టిని తోయించి కుప్పగా పోశారు. పెద్దఎత్తున సైకిల్ స్టాండులోకి నీరు చేరుతున్నాయి. పక్కనే మురుగుకాలువ ఉన్నా వర్షపునీరు వెళ్లిపోయేలా ఏర్పాటు చేయలేక పోయారు.

ప్రతిపాదనలు పంపాం

బస్టాండులో సౌకర్యాల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి ప్రతిపాదనలు పంపించాం. ఈ విషయమై ఎమ్మెల్యేతో కలిసి చర్చించాం. నిధులు మంజూరుకాగానే ఒక్కొక్కటిగా పనులు మొదలు పెట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులు కూర్చునే ప్రాంతంలో కొన్ని ఫ్యాన్లను పునరుద్ధరించాం. పని చేయని మిగిలిన వాటికి మరమ్మతులు చేయిస్తాం.

-టి.జనార్దన్, డిపో మేనేజర్, మైదుకూరు

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

ఇష్టంతో చదివితేనే ఉన్నతస్థానం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని జేసీ అదితిసింగ్ పేర్కొన్నారు. కడప కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో సోమవారం ఆమె బధిరులు, అంధులకు ల్యాప్‌టాప్, టచ్‌ఫోన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అంధులు, బధిరులు విద్యను కొనసాగించడానికి అనువుగా ప్రభుత్వం అవసరమైన సామగ్రి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఏడీ కృష్ణకిషోర్, కార్యాలయ పర్యవేక్షకులు అనిల్, సమాచార శాఖ ఏడీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న జేసీ అదితిసింగ్

పవన్‌కల్యాణ్ దీక్షకు సంఘీభావం

వేంపల్లె, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరిగిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు వేంపల్లెలో సోమవారం రాత్రి ఎన్డీయే నాయకులు సంఘీభావం ప్రకటించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, తెదేపా మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర నేతృత్వంలో పలువురు నాయకులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భాజపా వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, జనసేన నాయకులు నరేంద్రబాబు, దేవా, మల్లికార్జున పాల్గొన్నారు.


వేంకటేశ్వస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్న ఎన్డీయే నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె బ్యాంకు కూడలి వద్ద వీధిదీపాలు కాలిపోయి అంధకారం నెలకొనడంతో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచు ఆర్.శీను, ఈవో ఎన్వీసుబ్బారెడ్డి సిబ్బందిని పంపించి కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

వేముల : కడప, పులివెందుల ప్రధాన రహదారి నుంచి చాగలేరుకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరగాయని ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించిన చాగలేరు గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు శెట్టిపల్లె ఆంజనేయులు (చంటి) యంత్రం సాయంతో ముళ్లపొదలు తొలగించారు.

?: కడప ఫక్కీర్‌పల్లెలో వారం రోజుల నుంచి భూగర్భడ్రైనేజీ నుంచి మురుగునీరు లీకేజీ అవుతోంది. నగరపాలక అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి. **- చంద్ర, ఫక్కీర్‌పల్లె, కడప**

✓: నగరపాలక సిబ్బందిని పంపించి పూడిక తీసి, మురుగునీరు లేకుండా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప**

?: కడప కోర్టు పక్క నుంచి నాగార్జున పాఠశాలకు వెళ్లే దారి మొత్తం 15 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. **- మోహన్‌రెడ్డి, కడప**

✓: ఇంజినీరింగ్ అధికారులను పంపించి అనవసరంగా స్పీడ్ బ్రేకర్లు ఉంటే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, వైద్యాధికారి, - న్యూస్‌టుడే, కడప, చిన్నచౌకు**

?: పట్టణంలోని రైల్వేగేటు సమీపంలోని సంజన్న దుకాణం ఎదురుగా రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు పడేశారు. దీంతో ఈ దారిన వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. **- కరిముల్లా, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. **- షఫివుల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

?: పట్టణంలోని సూర్య ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. అధికారులు స్పందించి తొలగించాలి. **- గోపాల్, స్థానికుడు**

✓: పిచ్చిమొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- చాంద్‌బాషా, ఏఈ, - న్యూస్‌టుడే, కమలాపురం**

?: వంతాటిపల్లె పరిధి నిత్యపూజస్వామికోనకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **- రామకృష్ణ, సిద్దవటం మండలం**

✓: గ్రామ కార్యదర్శికి చెప్పి చెత్తను తొలగించే చర్యలు తీసుకుంటాం. **-జవహర్‌బాబు, ఎంపీడీవో, -న్యూస్‌టుడే, సిద్దవటం**

?: వేంపల్లె స్టేట్‌బ్యాంకు ఎదుట నెలరోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **- మోహన్, వేంపల్లె**

✓: వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.

?: వేంపల్లెలోని గొర్లమందల కాలనీ వద్ద వ్యర్థాలు రోడ్డుపై పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- నాగరాజు, వేంపల్లె**

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపించి వ్యర్థాలు తొలగిస్తాం. **- ఎన్వీ సుబ్బారెడ్డి, ఈవో, వేంపల్లె, - న్యూస్‌టుడే, వేంపల్లె**

కలెక్టరేట్‌లో గుక్కెడు నీరూ కరవే!

• క్యాన్లు కొనుగోలు చేస్తున్న ఉద్యోగులు • సందర్శకులకు తప్పని దాహార్తి

న్యూస్‌టుడే, జిల్లా సచివాలయం

జిల్లా పరిపాలనా కేంద్రమైన కలెక్టరేట్‌లో తాగేందుకు గుక్కెడు నీళ్లు కరవయ్యాయి. ఇక్కడ మూడు ప్రధాన విభాగాలున్నాయి. అందులో కలెక్టర్ కార్యాలయం (సీ బ్లాక్), సంక్షేమ శాఖలు(డీ బ్లాక్), ఇతర శాఖలు(ఓ బ్లాక్)లో సుమారు 50 వరకు కార్యాలయాలు ఉన్నాయి. కానీ ఇక్కడ తాగునీటి వసతి మాత్రం లేదు. ఉద్యోగులు తమ అవసరాలకు బయట నుంచి నీళ్ల క్యాన్లను బయట నుంచి కొనుగోలు చేస్తున్నారు. అన్ని విభాగాల్లో రోజుకు వందకు పైగానే క్యాన్లను వినియోగిస్తున్నారు. ఒక్కో దానికి రూ.15 - రూ.20 వరకు చెల్లిస్తున్నారు. ఇలా నెలకు రూ.50 వేల వరకు నీటికే వారు ఖర్చు చేస్తున్నారు.


ఉద్యోగుల కోసం బయట నుంచి తెస్తున్న నీళ్ల క్యాన్లు

బయట కొనుక్కోవాల్సిందే...

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి 500 మందికిపైగా వస్తుంటారు. ఇక్కడ కేవలం రెండు క్యాన్లు ఏర్పాటు చేస్తారు. అవి వెంటనే అయిపోతాయి. తర్వాత సందర్శకులు బయట దుకాణాలకు వెళ్లి నీళ్లను కొనుగోలు చేసి తాగాల్సిందే. గతంలో కలెక్టర్ ఛాంబరు ఎదుట వాటర్ కూలర్ ఉండేది. గత నాలుగేళ్లుగా ఆ ఏర్పాటు లేకుండా పోయింది. దీంతో సందర్శకులు దాహార్తితో ఇక్కట్లు పడుతున్నారు. దీనిపై జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో త్వరలోనే శుద్ధిజలానికి సంబంధించిన కూలర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని బ్లాకుల్లో మంచినీటి వసతి కల్పించేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

అధికారులు స్పందించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రజలతో పాటు కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు తాగునీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. సోమవారం వచ్చిందంటే బయట దుకాణాలు తాగునీరు కొనుగోలు చేసే వారితో కిటకిటలాడతాయి. అధికారులు స్పందించి శుద్ధిజలం అందించేలా చూడాలి.
- నాగసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ

ప్రతి బ్లాకులో ఏర్పాటు చేయాలి



కేవలం సోమవారమే కాకుండా వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్, డీ బ్లాక్‌లోని పలు శాఖలకు జిల్లా నలుమూలల నుంచి వస్తున్నారు. ఎప్పుడో ఉదయం బయలుదేరి కడప వస్తే ఇక్కడ తాగడానికి నీళ్లు కూడా లేవు. బయట కొనుగోలు చేయాల్సి రావడం దారుణం. డీ బ్లాకులోని సంక్షేమ కార్యాలయాల్లో ఎక్కడా కూడా చుక్క నీరు ఇవ్వరు. అధికారులు ప్రతి బ్లాకులో ప్రజల కోసం తాగునీటి వసతి కల్పించాలి.
- కిషోర్‌కుమార్, జిల్లా ఛైర్మన్, దళితహక్కుల సంఘం

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పరపల్లెలో జగనన్న కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నించారు. శేఖరాజుపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని ఉప్పరపల్లెలో సర్వే సంఖ్య 425/1లో ప్రభుత్వ స్థలంలో పది సెంట్లను ఒంటిమిట్టకు చెందిన కొందరు జేసీబీ యంత్రంతో చదును చేసేందుకు యత్నించారు. స్తంభాలు నాటేందుకు తెచ్చారు. దీనిపై సమాచారం అందడంతో సోమవారం సంబంధిత అధికారి ఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆయనతో ఆక్రమణదారులు వాగ్వాదానికి దిగారు. దీనిపై శేఖరాజుపల్లె వీఆర్వో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


నాటేందుకు తరలించిన సిమెంటు స్తంభాలు

భూములపై సంయుక్త సర్వే

సిద్దవటం, న్యూస్‌టుడే : మండల పరిధి నేకనాపురంలోని సర్వే సంఖ్య 295లో ప్రభుత్వ భూములపై సోమవారం సిద్దవటం మండల సచివాలయ సర్వే అధికారులు, కడప అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దారు మురాషావలి మాట్లాడుతూ త్వరలో 1,840 ఎకరాల భూమిని అటవీశాఖకు అప్పగిస్తామన్నారు.

స్థలాల విక్రయానికి అనుమతివ్వాలని వినతి

అరవింద్‌నగర్, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కొంచెం కొంచెం డబ్బులు దాచిపెట్టుకుని, 2009లో అగ్రిగోల్డ్ ఆధ్వర్యంలో భూములను కొనుగోలు చేశామని, ఇప్పుడు ఆ భూములను విక్రయించాలంటే రిజిస్ట్రేషన్ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని బాధిత సంఘం నాయకులు ఈశ్వరరెడ్డి అన్నారు. తమ భూములు విక్రయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

గండి ఆలయ అభివృద్ధికి కృషి

చక్రాయపేట, న్యూస్‌టుడే: గండి శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చినట్లు గండి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం ఆయన మంత్రిని కలిసి వినతిప్రతం అందజేశారు. గండి ఆలయ ఛైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ఆలయ మాజీ ఛైర్మన్ వెంకటస్వామి మంత్రిని కోరారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి, తెదేపా నాయకులు అశోక్‌కుమార్, చంద్ర పాల్గొన్నారు.

భూ సమస్యలపై రెవెన్యూ మంత్రికి వినతి

సిద్దవటం, న్యూస్‌టుడే : మండలంలోని పెద్దపల్లె పరిధి మందపల్లె రెవెన్యూ గ్రామంలోని పొలాలను ఉద్దిమడుగు రిజర్వాయరుకు కేటాయించారని, పరిహారం ఇవ్వకుండానే ఆన్‌లైన్ నుంచి రైతుల పేర్లు తొలగించారని, బాధితులకు న్యాయం చేయాలని రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్‌ను సిద్దవటం మండలంలోని భాకరాపేటకు చెందిన తెదేపా రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కాడే శ్రీనివాసులు నాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల క్లస్టరు బాధ్యుడు దశరథరామనాయుడు, తుర్రా ప్రతాప్ కోరారు. విజయవాడలోని తెదేపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మంత్రిని వారు కలిశారు.

చింతకొమ్మదిన్నె: దళితుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దళిత సంఘం జిల్లా నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి బాబు, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు వీరపుశేఖర్, జిల్లా గౌరవ సలహాదారు సుబ్బయ్య తదితరులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు కళాశాల ఆవరణ, జిల్లా కలెక్టరేట్ ఆవరణంలోని పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.శివరామకృష్ణ, ఎ.నాగరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.



స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు, పీవోలు

● యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-1 పీవో డాక్టర్ గంగయ్య ఆధ్వర్యంలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలోని గురుకులం విభాగం పరిసరాలలో వాలంటీర్లు పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ నెల 2 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కడప, చిన్నచౌకు: స్వచ్ఛతా హీ సేవా కార్యమంలో భాగంగా సోమవారం కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ ఆవరణలో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించారు. ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ సీఎంఈ భాస్కర్, పీవో ధనలక్ష్మి, డిపో మేనేజరు దిల్లేశ్వరరావు తదితరులున్నారు.

సేవలు అభినందనీయం: ఏఎస్పీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసుశాఖకు దాదాపు 35 ఏళ్ల పాటు చేసిన సేవలు అభినందనీయమని ఏఎస్పీ ప్రకాష్‌బాబు అన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్సై బి.ప్రదీప్‌కుమార్, ఏఎస్సై శివశంకర్‌లను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సన్మానించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ తదితరులున్నారు.


ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానిస్తున్న ఏఎస్పీ ప్రకాష్‌బాబు

పేదల ఆకలి తీర్చాలి

ఒంటిమిట్ట: పేదల ఆకలి తీర్చడానికి దాతలు ముందుకురావాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ పేర్కొన్నారు. ఒంటిమిట్ట శివాలయంలో సోమవారం భక్తులు, పేదలకు రాగి సంగటి వడ్డించారు. శివాలయంలో అన్నదానం నిర్వహిస్తున్న మహేశ్వరయ్యను అభినందించారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

కమలాపురం, న్యూస్‌టుడే : నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశం వైకాపా కౌన్సిలర్ల గైర్హాజరుతో వాయిదా పడిందని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మార్పురి మేరి తెలిపారు. వైకాపా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత సమావేశంలో ఆమోదం తెలిపిన పనులకు ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో సమావేశానికి హాజరు కాలేదన్నారు. పనులకు ఆమోదం తెలిపేంత వరకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. ఉపఛైర్మన్లు సాదిక్, శ్రీనివాసులరెడ్డి, కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు ఇవ్వండి... వస్తువులు తీసుకోండి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఇళ్లు, కార్యాలయాల్లో పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి, పునర్వినియోగమైన వస్తువులను తీసుకెళ్లాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. కడప కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కడప నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ రాకేశ్‌లతో కలిసి 'ప్లాస్టిక్ వ్యర్థాలు ఇవ్వండి.. . పునర్వినియోగ ఉత్పత్తులను పొందండి' అనే స్వచ్ఛతా హీ సేవ గోడపత్రాలను ఆవిష్కరించారు. కడప నగరంలోని రాజీవ్‌పార్కులో మంగళవారం సాయంత్రం కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గృహనిర్మాణ శాఖ పీడీ రాజారత్నం బాధ్యతల స్వీకరణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణశాఖ జిల్లా పథక సంచాలకులుగా రాజారత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న పీడీ కృష్ణయ్యను విజయవాడకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ప్రొద్దుటూరు ఈఈగా పనిచేస్తున్న రాజారత్నానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.



విద్యుత్తు డీఈలు: కడప గ్రామీణ: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు సరఫరా సంస్థ కడప టౌన్-1 డీఈగా నాగశేషారెడ్డి, కడప గ్రామీణ-1 డీఈగా రామచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. వారిని ఆయా విభాగాల ఏఈలు, సిబ్బంది అభినందించారు.

పులివెందుల డీసీటీవో : పులివెందుల (వేంపల్లె) : పులివెందుల డివిజన్ కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా దానంరెడ్డి జ్ఞానానందరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఆయన గ్రూపు-1 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి అసిస్టెంటు కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా నియమితులయ్యారు.

పాలక మండలి ఏర్పాటుకు ఉత్తర్వులివ్వాలని వినతి

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలోని వృషభాచలేశ్వర ఆలయ పాలకమండలి నియామకానికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని తెదేపా జిల్లా మాజీ కార్యదర్శి పీవీ రమణ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఆలయకమిటీ మాజీ ఛైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, తెదేపా నాయకుడు కృష్ణారెడ్డితో కలిసి అమరావతికి వెళ్లి మంత్రిని కలిశారు.

రూట జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కడప విద్య, న్యూస్‌టుడే : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా షేక్ జాకిర్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా ముల్లజుబేర్ అహ్మద్, కోశాధికారిగా కరామతుల్లా, అసోసియేట్ అధ్యక్షులుగా హబీబుల్లా, ఖాదర్‌బాషా, మునీంసాహెబ్, ఉపాధ్యక్షులుగా అలీఅక్బర్, ముజీబ్, అస్లం అదనపు ప్రధాన కార్యదర్శులుగా ముహమ్మద్ దావూద్, జిలానీబాషా, ఫైరోజ్‌బాషా, కార్యదర్శులుగా వలియ్యుల్‌ఖయ్యూం, ముహమ్మద్‌అలీ, అబ్దుల్‌బాసిత్ లను ఎన్నుకున్నారు.

ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేస్తే కఠిన చర్యలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప నగరంలో, శివారు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల విన్యాసాలు, రీల్స్ చేస్తూ కనిపిస్తే కేసులు నమోదుచేసి, కఠినచర్యలు తీసుకుంటామని కడప బాధ్య డీఎస్పీ రమాకాంత్ హెచ్చరించారు. ఇటీవల కొందరు మహావీర్ కూడలి నుంచి రిమ్స్ రోడ్డుపై రీల్స్ చేస్తున్న ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో యువతను, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ సీతారామిరెడ్డి ఉన్నారు.

అక్రమాలపై చర్యలకు డిమాండు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన బుద్ధ రియల్ ఎస్టేట్ సంస్థపై చర్యలు తీసుకోవాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై సోమవారం జేసీ అదితిసింగ్‌కు వినతి పత్రం అందించారు. రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణమే మాఫియాపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నిజాలను నిగ్గు తేల్చాలన్నారు. నాయకులు మక్బుల్‌బాషా, ప్రసాద్‌రాజు, లోకేష్‌రెడ్డి, బాలచెన్నయ్య, గంగన్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

● కడప వ్యవసాయశాఖ ఏడీని నియమించాలని కోరుతూ ఏపీరైతు సంఘం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి సంబంధిత అధికారులకు వినతి పత్రం అందించారు.

రామయ్యకు తెరల బహూకరణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామయ్యకు ప్రత్యేకంగా శంఖుచక్రనామాలతో తయారు చేయించిన రూ.54 వేల విలువైన నాలుగు తెరలను నంద్యాల జిల్లా అహోబిలం చెందిన ప్రవాసాంధ్రుడు, భక్తుడు రంగారావు గోష్టి సోమవారం బహూకరించారు.

అకడమిక్ కౌన్సిల్ సమావేశం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే : కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో పలు విషయాలు చర్చించారు. ప్రిన్సిపల్ వి.సలీంబాషా, కౌన్సిల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.నాగమునిరెడ్డి, వైవీయూ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం!

సుమారు 25 మంది విద్యార్థులను లగేజీ వాహనంలో కుక్కేసి, నిలబెట్టి, ప్రమాదకర పరిస్థితిలో తీసుకెళుతున్న ఈ దృశ్యాన్ని నగరంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం మధ్యాహ్నం 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. ఏ అధికారీ పట్టించుకోలేదు. లోపల స్థలం లేక కొందరు వెనుక వేలాడుతూ ఉన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. చదువుకోవాల్సిన సమయంలో విద్యార్థులను ఇలా లగేజీ ఆటోల్లో తీసుకెళ్లడం ఎంత వరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఇలాంటి వాహనాలపై నిఘా ఉంచి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కడప నేరవార్తలు



'వీఆర్ఏ హత్యతో ఎలాంటి సంబంధం లేదు'

వేముల : మండలంలోని వి.కొత్తపల్లెలో వీఆర్ఏ నరసింహులు హత్య కేసులో పోలీసులు రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో అతడి కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. రమేష్‌కు హత్యతో ఎలాంటి సంబంధం లేదని పోలీసులతో వాదనకు దిగారు. దీనిపై ఎస్సై ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ విచారిస్తున్నామని, హత్యతో సంబంధం లేకపోతే ఇంటికి పంపిస్తామని చెప్పారు.

పేలుళ్ల సామగ్రి సరఫరాపై విచారణ : మండలంలోని వి.కొత్తపల్లెలో వీఆర్ఏ నరసింహులు హత్యకు ఉపయోగించిన జిలిటిన్‌స్టిక్స్, డిటోనేటర్ల సరఫరాపై పోలీసులు ముమ్మర విచారణ చేపట్టారు. పేలుడు సామగ్రి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు అనే కోణంలో విచారిస్తున్నారు. గ్రామానికి చెందిన గని నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మండలంలోని గనులపై సీఐ నాగరాజు తనిఖీ చేపట్టి సామగ్రికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలో మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రామరాజుపల్లెలో సుమంత్ అనే వ్యక్తి సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఓ మహిళ సామగ్రి కొనుగోలు కోసం వెళ్లగా ఆమె పట్ల అతను అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ...

ఒంటిమిట్ట: కొత్తమాధవరానికి చెందిన వైకాపా నాయకుడు, జిల్లా పరిషత్తు మాజీ ఉపాధ్యక్షుడు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కడప డివిజన్ బాధ్య డీఎస్పీ రమాకాంత్ సోమవారం విచారణ చేశారు. గత నెల 30న విద్యుత్తు బిల్లుల బకాయిలు చెల్లించాలని అడిగితే తనపై సుబ్బారెడ్డి, ఆయన తనయుడు శ్రీకర్‌రెడ్డి, మరికొందరు దాడి చేశారని లైన్‌మెన్ వేల్పుల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు, ఇతర సిబ్బందితో డీఎస్పీ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

జీతాల పెంపునకు ఒప్పంద అధ్యాపకుల నిరసన

వేంపల్లె, న్యూస్‌టుడే : జీతాలు పెంచాలని కోరుతూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఒప్పంద అధ్యాపకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు నజీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రధాన గేటు వద్దకు వచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు.

పబ్లిక్ నోటీసు

క్రింద కనిన షెడ్యూలు ఆస్తి గతంలో అయిదు అంకణముల మిద్దె ఇల్లుగా కడప టౌన్, ఆర్.కె.ఎం.వీధిలో ఉండబడి రంతుల్లా ఖాన్ కుమారుడు రసూల్ ఖాన్‌కు 6-8-1947 (Doc. No. 1964/1947) విక్రయ దస్తావేజు ద్వారా చెందినది. సదరు రసూల్ ఖాన్ గతించిన తర్వాత ఆయన వారసులైన ఇరువురు కుమారులు పి.కరీముల్లా ఖాన్, డి.ఖాదర్‌వలి ఖాన్ ఉరఫ్ జమ్మత్ మరియు నలుగురు కుమార్తెలైన మోహరున్నీసా బేగం, భర్త డి.హఫీజుల్లా, రహమతున్నీసా బేగం, భర్త గౌస్ అహమ్మద్ ఖాన్, షంషున్నీసా బేగం, భర్త కె.సి.ఇందాదుల్లా ఖాన్, సాబిరా బేగం, భర్త పహాబ్ ఖాన్ అను వారలు వారి కుటుంబ ఆస్తులను 9-4-2003వ తేదీ (Doc. No. 2964/2003) రిజిష్టర్డు భాగపరిష్కార దస్తావేజు ద్వారా పంచుకొనియున్నారు. రసూల్ ఖాన్ గారి ఆస్తులలో పై తెలిపిన ఆస్తి రెండవ కుమారుడైన డి. ఖాదర్‌వలి ఖాన్‌కు సదరు దస్తావేజులో 'B' షెడ్యూలు నందు 1, 2 అయిటములుగా రాబడినది. తర్వాత సదరు ఖాదర్‌వలి ఖాన్ గారు పాతమిద్దె, వసారాలను పడగొట్టి క్రింద కనిన కమర్షియల్ షాపు రూములు నిర్మించియున్నారు. ప్రస్తుతం కడపకు చెందిన ముడియం హరిప్రియ, భర్త ముడియం రామచంద్రుడు గారు ఈ ఆస్తిని సదరు ఖాదర్‌వలి ఖాన్ వద్ద నుంచి కొనుగోలు చేయదలచి అందుకోసం **కడప ఇండియన్ బ్యాంక్, మెయిన్ బ్రాంచి** వారి నుంచి రుణం కోరియున్నారు. కావున ఇందు గురించి ఎలాంటి వ్యక్తులకు గానీ, కంపెనీలకు గానీ, ఫైనాన్సు సంస్థలకు గానీ, బ్యాంకులకు గానీ మరియు ఏరకమైన ఇతరులకు గానీ అభ్యంతరములున్నచో ఈ నోటీసు వెలువడిన '7' దినములలోగా క్రింద కనిన అడ్రసు వారికి గానీ లేదా పై తెలిపిన బ్యాంకు వారికి గానీ వ్రాతమూలకముగా తెలుపుకొనవలసినదిగా కోరడమైనది. లేని యెడల ఈ ఆస్తిని వివాదరహితమైనదిగా పరిగణించి రుణము మంజూరు చేయబడును. తదుపరి వచ్చు అక్షేపణలు ఈ రుణం తాలూకు పై తెలిపిన బ్యాంకు వారి హక్కులకు ఎటువంటి ప్రతిబంధకములు కాజాలవని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూలు

కడప డి॥, కడప అర్బన్ సబ్ డి., కడప మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన, కడప టౌన్, రామక్రిష్ణ మొదలియార్ వీధి (ఆర్.కె.యం స్ట్రీట్)లోని మున్సిపల్ కొత్త డోర్ నెం. 19/689, 19/690ర్లు గల పాత దంతెల రూములున్నూ మరియు డోర్ నెం. 19/697రుకు (ఉత్తరం దిశన) గల పాత దంతెల మిద్దె ఇల్లు (1వ అయిటం ఆస్తి)గా ఉండి, మున్సిపల్ కొత్త డోర్ నెం. 19/698రుకు (పడమర దిశన) గల పాత రేకుల వసారా ఇల్లు (2వ అయిటం ఆస్తి)గా ఉండి, డెమాలిష్ చేసి ఒకటిగా 'L' ఆకారంలో నిర్మించిన ఆర్.సి.సి.నమూనా గల ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్ వారి డోర్ నెం. 19/689, 19/690ర్లు (అసెస్‌మెంటు నెం. 1013020165), డోర్ నెం. 19/697-1రు (అసెస్‌మెంటు నెం. 1013024393), డోర్ నెం. 19/698రు (అసెస్‌మెంటు నెం. 1013020170)ర్లు గల ఆర్.సి.సి. నమూనా గల స్లాబు కప్పు గల కమర్షియల్ షాపు రూములకు సర్వే నెంబరు. **హద్దు వివరం :** ఈ ఆస్తి కడప టౌన్ గ్రామం పొలం సర్వే నెం. 30/2బి/1ఏ1రు లోనిది **: తూర్పు :** జాయింటు రస్తా మరియు ప్రభువ రెగ్జిన్ షాపు గోడౌన్, **పడమర :** రామక్రిష్ణ వీధి రోడ్డు, **ఉత్తరం :** యస్.బిలాల్, మగ్బూల్ బాష, షేక్ గౌసపీర్, అఫ్జల్ జహాన్ వగైరాల ఆస్తి, **దక్షిణం :** ఈ షాపు రూముల వారి 3 అడుగులు, పి.కరీముల్లా ఖాన్ గారి 3 అడుగులు, వెరశి 6 అడుగులు వెడల్పుతో గల కామన్ దారి సందు రస్తా.

డి.లక్ష్మీనారాయణ, అడ్వకేట్
Indian Bank, Standing Counsel
Flat No. 102, గంగయ్య అపార్ట్‌మెంట్, 1-337-6, Opp : District Court East Gate, KADPA.

గ్రామీణ క్రీడాకారులు... హ్యాండ్‌బాల్లో ధీరులు

చక్రాయపేట, న్యూస్‌టుడే : ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపిస్తున్నారు గండి బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థులు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తున్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో సత్తాచాటి జాతీయ జట్లకు ఎంపికయ్యారు. ఈ పాఠశాల విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ సత్తా చాటుతున్నారు. జాతీయస్థాయిలో కూడా సత్తాచాటి పతకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.


హ్యాండ్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యం



మాది వ్యవసాయ కుటుంబం. హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. జాతీయస్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను. క్రీడలతో పాటు ఉన్నత చదువులు కొనసాగిస్తాను. **- పి.శ్రావణ్‌కుమార్, ఎంపీసీ, తిరుపతి**

ధైర్యం పెరిగింది



ప్రత్యర్థి జట్టును దీటుగా ఎదుర్కొనేందుకు మరింత ధైర్యం పెరిగింది. గతంలో ఈ విషయంలో కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడంతో ఎంతో నేర్పుతో ఆడగలిగాం. జాతీయస్థాయిలో కూడా రాణిస్తాను. క్రీడలతోపాటు ఆర్మీలో ఉద్యోగం సాధిస్తాను. **- పూజిత్‌నాయక్, బైపీసీ, రాజంపేట**

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలంటే భయంగా ఉండేది. ప్రస్తుతం జిల్లాస్థాయి పోటీల్లో తలబడటంతో ఉత్సాహం పెరిగింది. రాష్ట్రస్థాయి పోటీల్లో మరింత నైపుణ్యాన్ని ప్రదర్శించి, జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అక్కడ కూడా సత్తా చాటుతాను. **- ఎం.విశ్వనాథ్, బైపీసీ, నార్పల, అనంతపురం**